సాక్షి
హనుమకొండ
శుక్రవారం | 3 | మార్చి | 2023



ఏసీబీ వలలో జీపీ ఈఓ

రోడ్డు నిర్మాణ పనుల బిల్లు విషయమై సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ శివునిపల్లి మేజర్ జీపీ ఈఓ చిరంజీవి ఏసీబీకి పట్టుపడ్డాడు. - 8లో▸



వీధి కుక్కల స్వైర విహారం

జనగామ పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గురువారం కుక్కల దాడిలో వృద్ధురాలు, చిన్నారితోపాటు పలువురు గాయపడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0° /20.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంపాక్ట్ పోస్టర్ ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 13, 14 తేదీల్లో వంశీరెడ్డి ఫౌండేషన్ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించబోయే వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం ఇంపాక్ట్ పోస్టర్‌ను కేయూ వీసీ తాటికొండ రమేశ్ గురువారం ఆవిష్కరించారు. ఆయా తేదీల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉచిత వికాస శిక్షణ తరగతులు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు జేడీ లక్ష్మీనారాయణ, యండమూరి వీరేంద్రనాథ్, ప్రదీప్, ఆకెళ్ల రాఘవేంద్ర, బాలాలత, సైనా జైస్వాల్ తదితరులు పాల్గొని శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని మాస్టర్ మోటివేటర్ గంపా నాగేశ్వర్‌రావు నిర్వహించబోతున్నారని, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, డాక్టర్ రాజమహ్మద్, గిరిధర్, లోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైతికత, మానవ విలువలపై పరీక్ష

విద్యారణ్యపురి: జిల్లాలోని ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 4న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువలపై, 6న పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహించనున్నామని డీఐఈఓ ఎ.గోపాల్ గురువారం తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరు కావాలని, హాజరు మినహాయింపుతో ఈ ఏడాది మార్చిలో పరీక్షలకు హాజరవుతున్న ప్రైవేటు అభ్యర్థులు, గతంలో ఆయా పరీక్షలు రాయని వారు కూడా తప్పనిసరిగా రాయాలని, లేదంటే ఇంటర్ పాస్ సర్టిఫికెట్లు జారీ చేయబోమని పేర్కొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్



హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా కొండా శ్రీనివాస్‌ను నియమిస్తూ కేంద్ర కమిటీ నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఎలక్షన్, కేంద్ర కమిటీ తుది నిర్ణయం వరకు శ్రీనివాస్ ఈ పదవిలో కొనసాగుతారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.స్థితప్రజ్ఞ, కాల్వల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్, డి.హరికుమార్, ఎస్‌కే.అఫ్జల్, చల్ల శ్రీజ్యోతి, ఎన్.నర్సయ్య తదితరులు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘంలో నాలుగు డైరెక్టర్ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరగనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయభాస్కర్, బిల్లా ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టులోని పాత బార్ అసోసియేషన్(మహాత్మాగాంధీ హాల్‌లో) ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు స్థానాలకు జరిగే పోటీలో బరిలో 10 మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల్లో మొత్తం 1,247 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

6న కేడీసీలో జాబ్‌మేళా

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు డిగ్రీ విద్యార్థులతోపాటు బీటెక్ విద్యార్థులు కూడా హాజరు కావచ్చని తెలిపారు. మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు.

23న డాక్ అదాలత్

హన్మకొండ: ప్రజల నుంచి తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడానికి ఈనెల 23న 42వ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటిండెంట్ నందా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఆబిడ్స్‌లోని డాక్ సదన్‌లో 23న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రీజియన్ పోస్టు మాస్టర్ జనరల్ డాక్ అదాలత్ నిర్వహిస్తారని తెలిపారు. ఫిర్యాదులను సంతోష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్–500001 చిరునామాకు ఈనెల 13వ తేదీలోపు పంపాలని ఆయన కోరారు.

పదికి ప్రత్యేక ప్రణాళిక

- వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యం
- జిల్లాలో ఇప్పటికే పూర్తయిన సిలబస్
- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

విద్యారణ్యపురి: వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులపై జిల్లా విద్యా శాఖ దృష్టి సారించింది. వంద శాతం ఫలితాలు సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలోని టెన్త్ విద్యార్థుల కోసం ఉదయం ఒక గంట, సాయంత్రం మరో గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు అలసిపోకుండా ఉండేందుకు సాయంత్రం వేళ అల్పాహారం కూడా అందిస్తున్నారు.

సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు..

టెన్త్ విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తయింది. రివిజన్ కూడా చేస్తున్నారు. విద్యార్థులు సమస్యలు ఎదుర్కోకుండా జిల్లాస్థాయిలో రిసోర్స్ గ్రూపులను ఏర్పాటు చేసి ఆయా సబ్జెక్టులవారీగా స్కూల్ అసిస్టెంట్లలో విషయ నిపుణులను ఎంపిక చేశారు. ఆయా స్కూల్ అసిస్టెంట్ల సెల్ నంబర్లను కూడా జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు పంపించారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే వారితో మాట్లాడి నివృత్తి చేసుకోవచ్చు.

జిల్లాస్థాయి మానిటరింగ్ టీంలు

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లాస్థాయిలో మానిటరింగ్ టీంలతోపాటు రాష్ట్రస్థాయి మానిటరింగ్ టీంలు కూడా ఉన్నత పాఠశాలలను సందర్శిస్తున్నాయి. తగిన సూచనలు సలహాలు ఇస్తున్నాయి.





అభ్యాస పుస్తకాలతో టెన్త్ విద్యార్థినులు

ప్రశ్నపత్రాలపై అవగాహన

ఈ విద్యాసంవత్సరం నుంచి సబ్జెక్టుకు ఒక ప్రశ్నపత్రం చొప్పున 6 మాత్రమే ఉంటాయి. ఇంటర్నల్ మార్కులు 20 ఉంటాయి. మిగితా 80 మార్కులకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నూతన ప్రశ్నపత్రాలపై పట్టు ఉండేలా ఇప్పటికే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ద్వారా అవగాహన కల్పించారు.

భయాన్ని తొలగించేలా..

పరీక్షలపై భయాన్ని తొలగించేలా.. ఆందోళన లేకుండా నూతనోత్తేజం.. ఆత్మవిశ్వాసంతో పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు వారానికి ఒక సబ్జెక్టు చొప్పున పరీక్షలు పెడుతూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. రాని జవాబులపై మరోసారి తర్ఫీదు ఇస్తూ ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.



ఏబీసీ గ్రూపులుగా..

టెన్త్ విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి.. సీ, బీ గ్రూపు విద్యార్థులపై టీచర్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కొందరు టీచర్లు వారి తల్లిదండ్రులతో కూడా ఫోన్లలో మాట్లాడుతున్నారు. వేకప్ కాల్స్‌తో ప్రతీ రోజు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ విద్యార్థులను ఉదయం 5 నుంచి 5.30 గంటల మధ్య మేల్కొల్పుతున్నారు. తెల్లవారుజామున చదివితే జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో అలా చేస్తున్నారు. అంతేకాక కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకొని పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేస్తున్నారు.

అభ్యాస దీపికల పంపిణీ..

విద్యార్థులు మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంగా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా రూపొందించిన అభ్యాస దీపికలను పదో తరగతి విద్యార్థులకు అందించారు. సులభంగా చదివి అర్థం చేసుకొని పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి ఇవి దోహదం చేస్తాయి.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనేది లక్ష్యంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. అలాగే 10/10 జీపీఏ కూడా ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం.

\- అబ్దుల్‌హై, డీఈఓ

విద్యార్థుల ప్రగతికి నాంది..



స్కూల్ అసిస్టెంట్లు ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు ఇంటింటి చదవుల పంట యాప్ ద్వారా విద్యార్థులకు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. 'ఏ' గ్రూపులోని విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేలా కృషి చేయాలి.

\-ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమీక్షలో కలెక్టర్, అధికారులు

హన్మకొండ అర్బన్: 18 ఏళ్లు పైబడిన వారందరూ కంటి వెలుగు శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకునే విధంగా ఆశాలు, మెప్మాలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు సభ్యులు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు మూడు నెలలలోపే రిజిస్ట్రేషన్ విధిగా చేయించుకునేలా చూడాలని, సిజేరియన్ డెలివరీ ఆడిట్ నిర్వహిస్తూ సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు ఎక్కువగా జరగాలన్నారు. పిల్లలకు 100 శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు ఉమాశ్రీ, వాణిశ్రీ, హిమబిందు, ఆప్తాల్మిక్ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వేషధారణలో విద్యార్థినీ విద్యార్థులు





ట్రెడిషనల్ అదుర్స్

వివిధ దేశాలు, మతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం ట్రెడిషనల్ డే నిర్వహించారు. - నయీంనగర్

పెరిగిన సాగు విస్తీర్ణం

- జిల్లాలో మొత్తం సాగు 1,77,133 ఎకరాలు
- గతేడాది 1,56,752 ఎకరాల్లో..

హన్మకొండ: నీటి వనరులు, లభ్యతనుబట్టి సాగుకు పరిస్థితులు అనుకూలంగా మారాయి. దీంతో పంటల సాగు ఏటా పెరుగుతూ వస్తోంది. సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం, విస్తారంగా కురిసిన వర్షాలతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నిండాయి. సమృద్ధిగా కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టం పెరిగింది. సాగు నీరు పుష్కలంగా ఉండడంతో యాసంగి పంటల సాగు పెరిగింది. నీటి లభ్యత పెరగడంతో రైతులు వరి సాగుపై మక్కువ చూపారు. దీంతో వరి సాగు గణనీయంగా పెరిగింది. జిల్లాలో గతేడాది యాసంగిలో అన్ని పంటలు కలిపి 1,56,752 ఎకరాలు సాగు కాగా.. ప్రస్తుత యాసంగిలో అన్ని పంటలు కలిపి 1,77,133 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో వరి గతేడాది 1,02,559 ఎకరాల్లో సాగు కాగా.. ఈ యాసంగిలో ఇప్పటివరకు 1,31,906 ఎకరాల్లో సాగైంది. మిగతా పంటలతో చూసుకుంటే వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. మొక్కజొన్న సాగు గతేడాదితో చూసుకుంటే తగ్గింది. గతేడాది 50,322 ఎకరాల్లో సాగు చేయగా.. ప్రస్తుతం 44,414 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కాగా.. యాసంగి పత్తి 146 ఎకరాల్లో, నూనె గింజల పంటలు 434 ఎకరాలు, పప్పుదినుసుల పంటలు 138 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.



మహిళల భద్రతపై భరోసా కల్పించాలి

సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: మహిళల పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తిస్తే షీ టీం పోలీసులు తక్షణమే స్పందించాలని, మహిళల భద్రతకు భరోసా కల్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ షీ టీం పోలీసులకు పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా సీపీ షీ టీం కార్యాలయంతోపాటు అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా రంగంపేటలోని షీ టీం కార్యాలయానికి చేరుకున్న సీపీ కార్యాలయం, పరిసరాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మహిళల భద్రత కోసం పోలీస్ యూనిట్లవారీగా ఏర్పాటైన షీ టీం విభాగాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యత ప్రతీ అధికారిపై ఉందన్నారు. మహిళలు స్వచ్ఛందంగా షీ టీం బృందాలకు సమాచారం అందించే విధంగా వారిలో నమ్మకాన్ని కలిగించాలన్నారు. రాబోయే రోజుల్లో షీ టీం విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. మహిళలు ఎలాంటి లైంగిక దాడులకు గురవుతున్నా తక్షణమే షీ టీం విభాగం సెల్ నంబర్ 87126 85142, 87126 85270కు లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ నంబర్ 87126 85257కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో క్రైమ్స్ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీ పుష్పారెడ్డి, క్రైమ్ ఏసీపీ డేవిడ్‌రాజు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి షీ టీం ఇన్‌స్పెక్టర్ సంజీవ్, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి, భరోసా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

'రూ.37కోట్ల పన్నులు వసూలు చేయండి'

వరంగల్ అర్బన్: ఆస్తి పన్ను వసూళ్లకు ఈ ఆర్థిక సంవత్సరానికి 29 రోజుల గడువు మాత్రమే ఉందని, ఇంకా రూ.37కోట్లు వసూలు చేయాలని బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, జోనాలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లకు 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతీ బృందంలో ఐదుగురు సిబ్బంది ఉంటారని, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. మొత్తం పన్నుల లక్ష్యం రూ.93కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ.56కోట్ల పన్నులు మాత్రమే వసూలయ్యాయన్నారు. ఈనెల 31 తర్వాత పన్నుపై 2 శాతం వడ్డీతో వసూలు చేస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం నగరవ్యాప్తంగా 8 మీసేవ కేంద్రాలు, కాశిబుగ్గ కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా మీసేవ కేంద్రాలు, సిబ్బంది పని చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్వోలు సుదర్శన్, యూసుఫొద్దీన్, శ్రీనివాస్, శాహాజీదీ బేగం, రెవెన్యు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలను దోచుకునేందుకే ధరల పెంపు

చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం దుర్మార్గమని, పేద ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఎల్‌పీజీ సిలిండర్ ధరలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి.. వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం ఎనిమిదేళ్లుగా ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేయడం, పెట్రోల్ ధరలు పెంచడం, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకురావడం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం లాంటి పనులు చేస్తూ వస్తోందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలకు మోదీ ఇచ్చిన కానుక ఇదేనా.. అని ప్రశ్నించారు. సిలిండర్ ధరలు తగ్గించే వరకు నిరసనలు ఇలానే కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ నూగుల మానసా రాంప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా సుబేదారి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా గ్యాస్ ధరలపై భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. నిరసనలో భాగంగా కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసి వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అయితే కొందరు కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించి వారి కోసం తెచ్చిన బిర్యానీని మళ్లీ పొయ్యిపై పెట్టి మంట పెట్టడంతో అది మాడిపోయింది. ఇక వంటావార్పులో వండిన అన్నం రోడ్డు పక్కన కుమ్మరించడం విమర్శలకు తావిచ్చింది.



వంట చేస్తున్న వినయ్‌భాస్కర్, పక్కన మేయర్ సుధారాణి, ఇతర నాయకులు

బీఆర్‌ఎస్ దాడులకు భయపడేది లేదు

- కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది..
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే

హన్మకొండ అర్బన్: బీఆర్‌ఎస్ పార్టీ దాడులకు భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే అన్నారు. ఇటీవల దాడికి గురైన కాంగ్రెస్ యువనేత తోట పవన్‌ను నగరంలోని అడ్వకేట్స్ కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి గురువారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ దాడులు మితిమీరిపోతున్నాయని, కోదాడలో వాల్యానాయక్‌ను చంపే ప్రయత్నం చేశారన్నారు. ఇటీవల రేవంత్‌రెడ్డి సభలో యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై అతి దారుణంగా దాడి చేశారన్నారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే చేయించాడని, ఇది ఆ పార్టీ నాయకులకు కూడా తెలుసన్నారు. ఇలాంటి దాడులు అప్రజాస్వామికమని, వీటిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుంది కేవలం కేసీఆర్ కుటుంబమేనన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా బీఆర్‌ఎస్ లాంటి పార్టీలను ఏకం చేసే పనిలో బీజేపీ ఉందన్నారు. కేసీఆర్, నరేంద్ర మోదీతో ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ పడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒకటేనన్నారు. డబ్బు, పోలీసుల సహకారంతోనే బీఆర్‌ఎస్ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన ధీమా వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, టీపీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు హెచ్.వేణుగోపాల్, నాయకులు నమిండ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ రాంనగర్‌లోని మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ ఇంటికి తేనీటి విందుకు నేతలు వెళ్లారు.



తోట పవన్‌ను పరామర్శిస్తున్న మాణిక్‌రావు థాక్రే, కాంగ్రెస్ నాయకులు

కేసీఆర్ ఇక ఫాంహౌస్‌కే పరిమితం

- ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ దాడులు
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

భీమదేవరపల్లి: త్వరలోనే సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కానున్నట్లు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని, 2024 జనవరిలో తమ ప్రభుత్వమే ఏర్పడబోతుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ముసలివాడినయ్యానని ఇటీవల సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పాడని, మరోవైపు తమ సీఎం అభ్యర్థి కేటీఆర్ అని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారని.. ఇక కేసీఆర్ ఫాంహౌస్‌లోనే జపం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసినట్లు తెలిపారు. కాగా.. కొత్తకొండను మండలంగా ఏర్పాటు చేయాలంటూ కొత్తకొండ కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి వినతిపత్రం అందించారు. ధూప, దీప నైవేద్యం పథకంలో ప్రస్తుతం అందిస్తున్న రూ.6వేలను రూ.22,500లకు పెంచాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య రాష్ట్ర ప్రచార కార్యదర్శి జానకీపురం రవిశర్మ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ పొన్నం, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

14 నుంచి టెన్త్ రెండో ప్రీ ఫైనల్

విద్యారణ్యపురి: జిల్లాలో ఈనెల 14 నుంచి టెన్త్ విద్యార్థులకు రెండో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎండి అబ్దుల్‌హై, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ రాజన్న అన్ని యాజమాన్యాల హెచ్ఎంలను గురువారం ఆదేశించారు. ఈపరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను డీసీఈబీ నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఒక రోజు పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసి మరుసటిరోజు పరీక్షను నిర్వహించాల్సి ఉంటుందని టైంటేబుల్‌ను రూపొందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 10 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్‌రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. 12 మందిని కోర్టు కానిస్టేబుల్ ద్వారా కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు చెప్పారు. భూక్య రవి, బెల్లం రాకేశ్‌కు జైలు శిక్ష విధించారు.

ఏసీబీ వలలో జీపీ ఈఓ

- రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- ఆర్నెళ్లలో ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీసీపీ సుదర్శన్

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి గ్రామ పంచాయతీ ఈఓ కుర్ర చిరంజీవి సీసీ రోడ్ల నిర్మాణ పనుల బిల్లుల విషయమై సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీసీపీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివునిపల్లికి చెందిన సీసీ రోడ్లు తదితర రూ.21 లక్షల అభివృద్ధి పనుల్ని చిల్పూరు మండలం పల్లగుట్టకు చెందిన సబ్‌కాంట్రాక్టర్ శివరాత్రి కొమురయ్య ఏడాది క్రితం పూర్తి చేశాడు. ఆ బిల్లుల కోసం కొమురయ్య పలుమార్లు ఈఓ చుట్టూ తిరిగాడు. దానికి ఈఓ రూ.65 వేలు లంచం అడిగాడు. కొమురయ్య మొదట రూ.15 వేలు ఇచ్చాడు. మిలిగిన డబ్బులు బిల్లులు చేశాక ఇస్తానని చెప్పాడు. ఎంతకూ బిల్లు చేయకపోవడంతో గత నెల 23న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం సబ్‌కాంట్రాక్టర్ శివునిపల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్ వద్ద రూ.50 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఈఓను పూర్తి స్థాయిలో విచారించి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తామని ఏసీబీ డీసీపీ సుదర్శన్ తెలిపారు.

ఆర్నెళ్ల వ్యవధిలో ఒకే శాఖ నుంచి ఇద్దరు..

మండలంలో ఆర్నెళ్లలోపు ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది. ఘన్‌పూర్ ఎంపీడీఓగా పని చేసిన కుమారస్వామి గతంలో శివునిపల్లి ప్రత్యేక అధికారిగా పని చేశారు. ఈక్రమంలో ఆయన లంచం తీసుకుంటూ ఆగస్టులో ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. శివునిపల్లి ఈఓగా పని చేసిన వెంకటకిషోర్ ఎంపీడీఓను ఏసీబీకి పట్టించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. కాగా.. వెంకటకిషోర్ స్థానంలో వచ్చిన ప్రస్తుతం శివునిపల్లి ఈఓగా పని చేస్తున్న చిరంజీవి ఏసీబీకి చిక్కడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. కాగా.. ఉత్తమ అధి కారులుగా అవార్డులు తీసుకున్న వారే ఒకే శాఖ నుంచి ఏసీబీకి చిక్కడం గమనార్హం. ఆర్నెళ్ల వ్యవధిలో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడంతో మండలంలో అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం అవుతోంది.


ఏసీబీకి చిక్కిన ఈఓ చిరంజీవి

తిప్పించుకున్నాడు..



శివునిపల్లికి చెందిన ఎంపీటీసీ రాజుకు వచ్చిన పనులను నేను సబ్ కాంట్రాక్టు తీసుకున్నా. రూ.21 లక్షల పనులు చేసి ఏడాదిగా ఈఓ చుట్టూ తిరుగుతున్నా. అతను మొదట రూ.1.20 లక్షలు డిమాండ్ చేశాడు. అనంతరం రూ.65 వేలకు ఒప్పుకున్నాడు. మూడు నెలల క్రితం రూ.15 వేలు ఇచ్చా. అయినా పని చేయకపోవడంతో మిగిలిన డబ్బులిస్తేనే చేస్తానన్నాడు. దాంతో ఏసీబీ అధికారులను సంప్రదించా.

\- సబ్‌కాంట్రాక్టర్ కొమురయ్య

చిల్డ్రన్స్ హోమ్‌కు బాల కార్మికులు


చిన్నారులతో రోడ్డు పనులు చేయిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్‌లైన్ కౌన్సిలర్ అరుణ

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడ: 'కంకర పని.. కక్కుర్తి కాంట్రాక్టర్' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గంగారం మండలం కామారం రోడ్డు పనుల్లో శ్రమిస్తున్న చిన్నారులను చైల్డ్ లైన్ అధికారులు చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించారు. గురువారం అధికారులు పనులు జరిగే చోటికి వెళ్లారు. అప్పటికే ఇద్దరు చిన్నారులు పనులు చేస్తూ అధికారులకు పట్టుబడ్డారు. పిల్లలతో కంకర పనులు చేయిస్తున్న తల్లిదండ్రులకు చైల్డ్‌లైన్ కౌన్సిలర్ అరుణ కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను మహబూబాబాద్‌లోని బాలగృహం, బాలున్ని దైవకృప హోంకు తరలించారు. పనులు చేయిస్తున్న వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట అనిల్, వంశీ ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు.

పెళ్లింట్లో విషాదం

- గుండెపోటుతో బ్యాంకు ఉద్యోగి మృతి
- ఆగిన రిసెప్షన్


విజేందర్(ఫైల్)

కురవి: మరికొద్ది గంటల్లో వరుడి ఇంట్లో పెళ్లి రిసెప్షన్. ఆనందంగా గడపాలని అంతా సిద్ధమవుతున్నారు. అంతలో ఆనందమంతా ఆవిరైంది. వధువు అన్న గుండెపోటుతో మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం శివారు జుజ్జూర్ తండా గ్రామంలో బానోత్ విజేందర్(31) గురువారం గుండెపోటుతో అక్కడిక్కడే మృతి చెందాడు. జుజ్జూర్ తండాకు చెందిన బానోత్ విజేందర్ జగిత్యాల జిల్లాలో యూనియన్(ఆంధ్రాబ్యాంకు)లో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి బాబాయ్ కుమార్తె వివాహం బుధవారం తండాలో అట్టహాసంగా జరిగింది. గురువారం పెళ్లి కుమారుడి గ్రామంలో జరిగే రిసెప్షన్‌కు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. అదే సమయంలో విజేందర్‌కు గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. పెళ్లి కుమార్తె అన్న మృతి చెందడంతో సంతోషంగా ఉండాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. రిసెప్షన్ నిలిచిపోయింది.

స్నేహితుడి పెళ్లి వేడుకలకు వెళ్లొస్తూ..

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


రమణ మృతదేహం

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కోనాయిచలం గ్రామానికి చెందిన చంద రమణ(21) మృతి చెందాడు. రమణ, అనిల్ బైక్‌పై బుధవారం సాయంత్రం ఇదే మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడి పెళ్లి బరాత్‌కు హాజరయ్యారు. అనంతరం తిరిగి వస్తుండగా ఓబులాపూర్ క్రాస్ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈఘటనలో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంతో పాటు పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేసరికి రమణ మృతి చెందాడు. అనిల్ తీవ్ర గాయాలతో స్పృహ తప్పి పడిపోయాడు. అనిల్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

జాతీయ కబడ్డీ క్రీడాకారుడు..


తుడుం ప్రశాంత్ (ఫైల్)

కురవి: మండలంలోని నేరడలో సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తుడుం ప్రశాంత్(45) అలియాస్ పెంటయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రశాంత్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించాడు. క్రీడాకారుడి మృతదేహం వద్ద కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి తోట సురేశ్‌కుమార్, కబడ్డీ క్రీడాకారులు, వివిధ పార్టీల నాయకులు మల్లెపాక మధు, జంగం ఉప్పలయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి, కడియం సత్యం, గుగులోత్ రవినాయక్, పీఈటీలు మేక దామోదర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వెయిటర్..


ఓదెలు మృతదేహం

హసన్‌పర్తి: హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని భీమారం సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పరకాల మండలం లక్ష్మీపురానికి చెందిన అముదాలపల్లి ఓదెలు (45) మృతి చెందాడు. ఓదెలు భీమారంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడు. పని ముగిసిన తర్వాత ఓదెలు సమీపంలోని ఓ రెస్టారెంట్ అండ్ బార్‌లో ఖాళీ మద్యం సీసాలు సేకరించి అమ్ముతాడు. మంగళవారం రాత్రి పని ముగిసిన తర్వాత సీసాలు సేకరించి రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓదెలును ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున అతడు మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని వెస్ట్ బెంగాల్ వాసి..

కాజీపేట రూరల్: ప్రమాదవశాత్తు కాజీపేట–నష్కల్ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం రైలు ఢీకొని వెస్ట్ బెంగాల్‌కు చెందిన కాంట్రాక్టు కూలీ ప్రవీణ్ మండల్ (29) మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని ప్రవీణ్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మీ అవినీతిని రికార్డు చేస్తున్నా

- పీఎస్‌లో మతిస్థిమితం లేని మహిళ హల్‌చల్


హెడ్‌కానిస్టేబుల్‌తో మహిళ వాగ్వాదం

రఘునాథపల్లి: రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ హల్‌చల్ చేసింది. 'మీరు సరిగ్గా పని చేయట్లేదు. స్టేషన్‌లో అవినీతి ఎక్కువైంది. ప్రజలకు న్యాయం దక్కడం లేదు. మొబైల్‌లో అంతా రికార్డు చేస్తున్నా.. అంటూ గురువారం ఆమె రెండుగంటల పాటు హంగామా చేసింది. ఈక్రమంలో పోలీసులు, మహిళకు మధ్య వాగ్వాదం జరిగింది. వీడియో తీస్తున్న మహిళ దగ్గరి నుంచి మొబైల్ తీసుకొని పరిశీలించిన పోలీసులు అది పని చేయట్లేదని గుర్తించారు. కాగా.. అక్కడే ఉన్న ఎస్సై ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం! అనంతరం పోలీసులు ఆమె గురించి వివరాలు ఆరా తీయగా.. ఆమెకు మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడు ఇలాగే చేస్తుందని తెలుసుకున్నారు. గతంలో తాను పోలీస్‌నంటూ వాహనాలు తనిఖీ చేసినట్లు చెప్పారు.

పట్టపగలే చోరీ

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం బీసీ మల్లిగూడెం పంచాయతీకి చెందిన వీరస్వామి ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.13 లక్షల విలువైన బంగారం, రూ.18 వేల నగదు ఎత్తుకెళ్లారు. సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న వీరస్వామి సాయిబాబా ఆలయంలో పూజ చేసేందుకు భార్యతో కలిసి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. సీఐ శివప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

పెళ్లి చేసుకుని ముఖం చాటేశాడని ఫిర్యాదు

వర్ధన్నపేట: ప్రేమించి పెళ్లి చేసుకుని, ముఖం చాటేస్తున్నాడని తనకు న్యాయం చేయాలని ఓ యువతి గురువారం వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వర్ధన్నపేట ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండల పరిధి బండౌతపురం గ్రామానికి చెందిన చిదురాల రాజు అదే గ్రామానికి చెందిన మరుపట్ల భవాని కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. భవాని వరంగల్ ఎంజీఎంలో ల్యాబ్‌టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. రాజు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరి ఇళ్లు పక్క పక్కనే ఉండడంతో ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. దీంతో భవాని తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఇరువురు తల్లిదండ్రులకు చెప్పకుండా భద్రకాళి దేవాలయంలోని హనుమాన్ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం అమ్మ ఫోన్ చేస్తుందని చెప్పి భవాని వద్ద నుంచి వెళ్లి మూడు రోజులైనా తిరిగి రాలేదు. తాను రాజుకు ఫోన్ చేయగా.. నీవంటే ఇష్టం లేదని.. ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం లేదంటున్నాడని ఆమె పేర్కొంది. ఈమేరకు భవాని తనకు న్యాయం చేయాలని కోరుతూ.. ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

లారీ దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన లారీ

వెంకటాపురం (కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీ గురువారం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి రామచంద్రాపురం ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు లారీ అక్కడికి వచ్చింది. కాగా.. గురువారం తెల్లావారుజామున లారీ మంటల్లో కాలిపోయింది. లారీకి ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లారీకి మంటలు ఎలా అంటుకున్నాయనే విషయంపై పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

ఎనిమిది మంది కానిస్టేబుళ్ల అటాచ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి ఎనిమిది మంది కానిస్టేబుళ్లను మహబుబాబాద్ జిల్లా ఎస్పీకి అటాచ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెలువడిన తర్వాత సోషల్ మీడియాలో కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుళ్లపై వేటు అంటూ ప్రచారం సాగింది. దీంతో పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఇటీవల మహబూబాబాద్ నుంచి ఎనిమిది మంది కమిషనరేట్‌కు బదిలీపై వచ్చారని వారి స్థానంలో ఎనిమిది మందిని మహబుబాబాద్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు. ఆ కానిస్టేబుళ్లపై ఎలాంటి ఆరోపణలు లేవని ఆయన పేర్కొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- ఏడుగురికి గాయాలు


గాయపడ్డ చిన్నారి

జనగామ: పట్టణంలోని హనుమకొండ రోడ్డు ప్రెస్టన్ ఏరియా.. శ్రీసాయి రెసిడెన్షియల్ కాలనీలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. గురువారం తెల్లవారుజామున కాలనీవాసులపై ఓ నల్ల కుక్క దాడి చేసేందుకు యత్నించి భయభ్రాంతులకు గురి చేసింది. కాలనీలో కూరగాయలు అమ్మేందుకు వచ్చిన ఓ మహిళను ఓ కుక్క కరిచింది. వాకింగ్‌కు వెళ్తున్న మరో నలుగురిపై దాడి చేసింది. మరో ఐదు నిమిషాల తర్వాత కిరాణా దుకాణానికి వెళ్లేందుకు బయటకు వచ్చిన 50 ఏళ్ల బి.కిష్టయ్యపై దాడి చేసి గాయపరిచింది. పట్టణానికి చెందిన రాజిరెడ్డి, మాధవి దంపతుల 6 ఏళ్ల కుమార్తె పూర్ణశ్రీ దుకాణానికి వెళ్తుండగా కుక్క విచక్షణా రహితంగా దాడి చేసింది. చిన్నారి చేయి, చెవి, మెడ, కాలు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. కాగా.. మాసం విక్రయ దుకాణాలు, ఫంక్షన్ హాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మీల్స్ హోటల్స్ ప్రాంతాల్లో మిగిలిన ఆహార పదార్థాలను బయట వేస్తుండడంతో కుక్కల బెడద తీవ్రమవుతోంది. కుక్కల బెడద తీవ్ర మవడం తో కాలనీల ప్రజలు కర్రలు చేతిలో పట్టుకుని బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రాణం తీసిన అత్యాశ

బచ్చన్నపేట: అప్పు చేసి విదేశీ సంస్థల్లో పెట్టుబడి కోసమని ఓ మహిళ చేతుల్లో డబ్బు పెట్టి, చివరికి మోసపోయానని తెలిసిన మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన ద్యాగరి నర్సింగారావు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగారావు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అక్కడే ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో దగ్గరి బంధువైన ఓ మహిళతో స్నేహం ఏర్పడింది. విదేశీ సంస్థల్లో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు పొందవచ్చని ఆమె సూచించింది. దీంతో అతడు అత్యాశకు పోయి తెలిసిన వారి దగ్గర, బంధువుల దగ్గర రూ.1.50 కోట్లు అప్పు తీసుకుని ఆమె చేతుల్లో పెట్టాడు. కొద్ది రోజులకు తిరిగి తన డబ్బు తనకివ్వాలని అడగ్గా ఆమె ప్లేటు ఫిరాయించింది. ఏం చేయాలో తెలియక స్వగ్రామమైన కొన్నెకు వచ్చి మంగళవారం ఉరేసుకున్నాడు. రెండు రోజుల అనంతరం చుట్టు పక్కల వారు తలుపులను పగులగొట్టి చూడగా.. అతడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా.. నర్సింగారావు తన కుమారుడిని ఉన్నత చదువుల నిమిత్తం వారం క్రితమే అమెరికాకు పంపించాడు. ఆ ఆనందం నుంచి తేరుకోక ముందే కుటుంబంలో విషాదం అలుముకుంది.

భార్యతో గొడవపడి ఒకరు..

మడికొండ: భార్యతో గొడవ పడి మడికొండకు చెందిన చల్ల నాగరాజు(37) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాది కొత్తగూడెం జిల్లా ముల్కపల్లి గ్రామం రామనుంజనేయపురం గ్రామానికి చెందిన చల్ల నాగరాజు బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం మడికొండకు వచ్చి స్థానిక యువతి వల్లెపు రాజేశ్వరిని వివాహం చేసుకున్నాడు. వీరు కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం తాగి రావడంతో భార్యతో గొడవ పడ్డాడు. భార్య బయటకు వచ్చి కూర్చోగా, నాగరాజు ఇంట్లో ఉరేసుకొన్నాడు. కాసేపటికి భార్య వెళ్లి చూడగా.. నాగరాజు విగత జీవిగా వేలాడుతున్నాడు. మృతుడి అన్న చల్ల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై నర్సింహరావు తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..

పెండ్యాల్–నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం ఒక వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండకు చెందిన ఎలకంటి శివాజీ(30) పేయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత సమస్యల వల్ల జీవితంపై మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు

కాశిబుగ్గ: వరంగల్ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) ఎదుట ఆకతాయిల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. విద్యార్థినులు స్కూలుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అడ్డుకున్నవారిని బెదిరిస్తున్నారు. ఈస్కూల్లో పదో తరగతిలో దాదాపు వంద మంది విద్యార్థినులు ఉంటారు. వారు స్కూలుకు వెళ్తుండగా, వస్తుండగా ఆకతాయిలు బైక్‌లపై వచ్చి వేధిస్తున్నారు. స్పీడ్‌గా బైక్‌లు నడిపిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. గురువారం సాయంత్రం పాఠశాల వదిలే సమయంలో ఇద్దరు ఆకతాయిలు పాఠశాల గేటు ఎదుట బైక్ పెట్టుకుని అమ్మాయిలను వెకిలి చేష్టలతో ఇబ్బందులకు గురి చేశారు. బైక్‌పై స్పీడుగా వెళ్తూ.. వారిని ఇబ్బందులకు గురి చేశారు. ఇలా ఎందుకు చేస్తున్నారంటూ ఉపాధ్యాయులు బైక్ ఆపి వారిని అడిగితే వారిని బెదిరించి వెళ్లిపోయారు. గతంలో కొందరు ఆకతాయిలు ఇలాగే ప్రవర్తిస్తే ఉపాధ్యాయులు షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఎదుట, శివాలయం దారిలో షీటీం పోలీసులు నిఘా పెంచాలని, ఆకతాయిల భరతం పట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సిగ్మా ఆస్పత్రి ఎదుట ఆందోళన


అఖిల(ఫైల్)

హన్మకొండ చౌరస్తా: చావు బతుకుల మధ్య ఆస్పత్రికి వచ్చిన బాలికకు వారం నుంచి చికిత్స చేస్తున్నట్లు చెబుతూ.. ఆస్పత్రి యాజమాన్యం రూ.16 లక్షలు వసూలు చేసిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. బిల్లు మొత్తం చెల్లించాక చావు కబురు చల్లగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి బంధువు దిలీప్, సోదరుడు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలా వరంగల్ మండలంలోని గాడిపెల్లి గ్రామానికి చెందిన బెల్లి అఖిల(18) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 23న కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు హనుమకొండ కొత్తబస్టాండ్ సమీపంలోని సిగ్మా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక పరీక్షలు చేసిన డాక్టర్ శ్రీనివాస్ అత్యవసర విభాగంలో అడ్మిట్ చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఒప్పుకుని అడ్మిట్ చేశారు. వారం రోజుల పాటు చికిత్స అందిస్తున్నట్లు చెబుతున్న వైద్యులు రూ.16 లక్షలు వసూలు చేశారు. గురువారం ఉదయం సైతం అఖిల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని తెలిపారు. సాయంత్రం వరకు తమకు చూపెట్టకుండా నమ్మబలుకుతూ వచ్చారని, గట్టిగా నిలదీయడంతో అఖిల మృతి చెందిన విషయం చెప్పారని రోదిస్తూ తెలిపారు. ఆగ్రహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. డబ్బుల కోసం చికిత్స అందిస్తున్నట్లు నటించారని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతురాలి తల్లిదండ్రులు బెల్లి మొండయ్య, యాక లక్ష్మీ హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఆందోళన విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

ప్రీతి ఘటనలో సమగ్ర దర్యాప్తు జరపాలి


ప్రీతి చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న మురళి


ప్రీతి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాణిక్‌రావు థాక్రే

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే

కొడకండ్ల: ప్రీతి మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే డిమాండ్ చేశా. గురువారం గిర్నితండాలో నిర్వహించిన ప్రీతి పంచమ దిన కర్మ కార్యక్రమానికి రోహిత్ చౌదరి, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డితో కలిసి ఆయన హాజరై నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మాణిక్‌రావు థాక్రే విలేకరులతో మాట్లాడుతూ.. ప్రీతి ఎలా మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. ప్రీతి ఘటనను సీబీఐచే విచారణ జరిపించాలని మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ కోఆర్డినేటర్, ఓబీసీ పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి, పీసీసీ కార్యదర్శి గోమాత శ్రీనివాస్ తదితరులు ప్రీతి కుటుంబీకులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, అంజయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి: మాజీ ఐఏఎస్

పీజీ వైద్య విద్యార్థి దరావత్ ప్రీతిది ఆత్మహత్య కాదు హత్యే అనే అనుమానాలున్నందున జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, డాక్టర్ పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. గురువారం గిర్నితండాలో ప్రీతి పంచమదిన కర్మ కార్యక్రమానికి డాక్టర్ పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ప్రీతి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలపై కుటుంబసభ్యులకు నమ్మకం లేనందున జ్యుడీషియల్ ప్రభుత్వం విచారణ చేయించి అనుమానాలను నివృత్తి చేయాలని, నిందితులను గుర్తించి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు నాగేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయాలి: న్యాయ పోరాట కమిటీ

హన్మకొండ: దరావత్ ప్రీతి మృతికి పరోక్ష కారకుడైన డాక్టర్ నాగార్జునరెడ్డిని బదిలీ చేసి చర్యలు తీసుకున్నట్లు చూపి చేతులు దులుపుకోవడం కాదని, ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని డాక్టర్ ప్రీతి న్యాయపోరాట కమిటీ ప్రతినిధులు బానోతు నెహ్రూ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, మంద కుమార్ మాదిగ, జైసింగ్ రాథోడ్, సునీత నాయక్ డిమాండ్ చేశారు. అదే విధంగా సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి, అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26777]
- ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26775]
- వరంగల్ రంగశాయిపేట శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26749]

PLOTS FOR SALE

- వరంగల్ to పరకాల మేన్‌రోడ్డుకు గూడెప్పాడ్ జంక్షన్ దగ్గర విట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా 150 Sq.Yds గల Plots కలవు. వెంటనే సంప్ర: 7780386570. [W-775839]

FLATS FOR SALE

- KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26773]

SERVICES

ఆయుర్వేదం

- బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-11]

WANTED

- హన్మకొండలో మా ఆఫీసులో వర్క్ చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం గల లేడీ టెలికాలర్స్ & HNK, WGL, KZPT లో అనుభవం గల ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q: ఇంటర్/డిగ్రీ. సెల్: 9246891234 [WA-6902]
- హన్మకొండ, వరంగల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥- 12గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-15000. సంప్ర॥ 8688072125. [W-775835]
- కుటుంబ సమేతంగా అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. వసతి కల్పించబడును. సెల్: 9182922080 [WA-12803]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]
- అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-502]
- ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర: 93919 94780. [L-521]